
28—2—79

# ప్రేమిస్తే పెళ్ళవుతుంది!



**చంద్రం**

ఉదయం ఏడు గంటలకి కాఫీ తాగి, కాగితాలు ముందేసుకు కూచున్నాడు శంకరం. రాయటం, కొట్టేయటం, చింపెయ్యటం, నలిపెయ్యటంలాంటి పనులు కొన్ని చేసి—దాదాపు గంటన్నర సేపు శ్రమపడి—చివరికి, ఎనిమిదిన్నర ప్రాంతానికి చిత్తు కాపీ తయారు చేసి, దీర్ఘంగా నిట్టూర్చాడు. రాసింది ఒకసారి ఎవరికంటూ చదివి, మరోకసారి తేలిగ్గా—తృప్తిగా నిట్టూర్చాడు.

ఒకసారి భాష బాగులేదని, ఒకసారి భావం బాగులేదని, ఆ రెండూ బావుంటే వాక్యాలు వెనకముందయ్యాయని. రకరకాల అసంతృప్తులకులోనయ్యి, మానసికంగా, భౌతికంగా అంతసేపు కష్టపడి శంకరం రాసింది కథ కాదు, కవిత కాదు, పద్యంకాదు, వ్యాసం కాదు, సాహిత్య సంబంధమైనదేదీ కాదు.

శంకరం రాసింది ఉత్తరం. ఉత్తరం రాయటానికే అంత కష్టపడ్డాడు అంటే—రాయడం చేతకాక కాదు. అలవాటు లేకా కాదు. మిత్రులకీ, బంధువులకీ రాసుకునే సాధా ఉత్తరాలైతే క్షణాల్లో రాసి ముగించగల చాకచాక్యం అతనికుంది. మరి!—ఒక యువకుడు తన జీవితంలో మొట్టమొదటిసారిగా ఒక యువతికి రాస్తున్న ఉత్తరం అది!

శంకరం రాసింది ప్రేమలేఖ!

హృదయాన్ని విప్పి కాగితం మీద పరచాలి. మనోగతభావాలని అక్షరాల్లో పొందుపరచాలి. తన బాధని, తనకే స్పష్టంగా అర్థంగాని బాధని, ఆవేదనని, ఆకాంక్షని ఆమెకి అర్థమయ్యేలా చెప్పాలి. చదివి ఆమె హృదయం కరగాలి. ప్రేమామృతం పొంగి పొరలి ప్రవహించాలి. తనను వోలలాడించాలి! అంత తతంగం ఉంది ప్రేమలేఖంటే. ఏదో కాగితం ముక్క తీసుకుని నాలుగు వాక్యాలు గీకి పారేస్తే ఇంతటి శక్తి ఎలా వస్తుంది? శ్రద్ధగా, నిష్ఠగా, జాగ్రత్తగా రాయాలి.

శంకరం కవి కాదు. రచయిత కాదు. చదువుకున్నవాడు గనక చదివి అర్థం చేసుకోగలడు. కాని, స్వతంత్రంగా వ్రాయగల భాషాజ్ఞానం, రచనా సామర్థ్యం అతనికి లేవు. అందుకనే అంత కష్టపడ్డాడు. గంటన్నరసేపు ప్రయత్నించీ పది వాక్యాలకన్నా ఎక్కువ రాయలేక పోయాడు. మొదట్లైతే సుదీర్ఘమైన లేఖే రాయాలని తలపెట్టాడు. తీరా ప్రారంభించాక పావుటావు నింపడమే గగనమైపోయింది.

చిత్తుకాపీని మరోమారు సావధానంగా చదివి, అక్షర దోషాలు సవరించి, తుది మెరుగులు దిద్ది, మరో తెల్లకాగితం మీద చక్కగా ఫెయిర్ చేశాడు. అంతకు ముందు రోజే తెచ్చి సిద్ధంగా ఉంచుకున్న కవర్లో పెట్టి అంటించాడు. అడ్రసురాసి ఆ పూటే పోస్టు చేశాడు గూడాను.

నాలుగు వారాల నుంచి నలుగుతున్న సమస్య ఒక కొలిక్కి వచ్చింది.

శంకరం వయస్సు పాతిక. కాలేజి చదువు పూర్తి చేసి, మూడేళ్ళు నిరుద్యోగిగా ఉండి లోకానుభవం సంపాదించాడు. ఆ తర్వాత ఉద్యోగం సంపాదించాడు. అయిదొందల పైమాటే జీతం. చూస్తూండగానే సంవత్సరం గడిచి పోయింది. ఒక ఊరు మారటం కూడా జరిగిపోయింది. ఈ ఊరు వచ్చి నెల దాటింది.

గది వెతకడంలో వారం రోజులు పడ్డ ప్రయాసంతా గదిలో దిగిన మరుక్షణమే మర్చిపోగలిగాడు శంకరం. అదంతా ఎదురింటి మహాత్యం!

ఎత్తు ఐదడుగుల రెండంగుళాలు. వయసు పద్దెనిమిది సంవత్సరాలు. కోల ముఖం. పెద్ద పెద్ద కళ్ళు. సూది ముక్కు. సన్నని పెదవులు. పల్చని చెక్కిళ్ళు. చిన్ని గడ్డం. గుండ్రని కంఠం, బారెడు కురులు. తీర్చి దిద్దినట్టున్న అవయవ సౌష్ఠవం. ఆకర్షణీయమైన రూపం—ఇవీ ఎదురింటి మహాత్యాన్ని చూసి శంకరం గ్రహించిన విషయాలు.

పేరు సుజాత. చదువు ఇంటర్. ప్రస్తుత కాలక్షేపం టైపు రైటింగ్. హాబీలు—పత్రికలు, నవలలు, అల్లికలు, కుట్లు. పూర్వానుభవం—ఒక డజను పెళ్ళి చూపులు. ఇతరములు—అద్దె ఇల్లు, కట్నం ఇవ్వలేని తండ్రి, తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు—ఇవీ తర్వాత నెమ్మదిగా శంకరం సేకరించిన వివరాలు.

తొలి చూపుల్లోనే శంకరం కన్ను చెదిరింది. మనసు ఊగింది. మొదటి వారం చూపులతోనే తృప్తి పడ్డాడు. రెండవ వారం సుజాతను వెంటేసుకుని ఇష్టానుసారంగా విహరించాడు—ఊహాలోకాల్లో. మూడవ వారం సుజాతను చూడందే ఉండలేని స్థితికి వచ్చేశాడు. నాల్గవ వారం ఏదో చేసేయాలన్న ఉద్రేకానికి లోనైపోయాడు. వీటన్నింటి పర్యవసానమే ఈనాటి ప్రేమలేఖ!

రాయటం హుషారుగానే రాశాడు. పోస్టు చెయ్యటం ధైర్యంగానే చేశాడు. తీరా డబ్బాలో వేసిన

తర్వాత ఈ ఉత్తరం పొరపాటున సుజాత తండ్రి చేతిలో పడితేనో—అన్న అనుమానం వచ్చి గుండె దడదడలాడింది. పోస్టుమన్ ఉత్తరాలు తెచ్చే వేళకి సుజాత తండ్రి ఆఫీసులో ఉంటాడన్న మాట గుర్తొచ్చి మనసు కాస్త కుదుట పడింది.

రహస్యంగా సాగవలసిన తన ప్రేమారాధనంలో మూడవ వ్యక్తికి అవకాశం ఇవ్వటం శంకరానికి ఏంత మాత్రం ఇష్టం లేదు. కాని, ప్రేమలేఖ స్వయంగా సుజాత కందించే ధైర్యం తనకి లేకపోయింది. పోస్టుమన్ పాత్ర ప్రవేశం తప్పని సరైంది.

తన ఉత్తరం అందుకున్న తర్వాత సుజాత ప్రవర్తన ఎలా ఉంటుందో?

ఇంతవరకు వాలుచూపులు, మూగబాసలు, ముసిముసి నవ్వులేగాని ముఖాముఖి మాట్లాడింది లేదు. తన చర్యలకు ప్రతి చర్యలు లేకపోయినా ప్రతి ఘటన మాత్రం ఎప్పుడూ కనిపించలేదు. అందుకనే మౌనం అంగీకారంగా తీసుకున్నాడు. ఆ ధైర్యంతోనే ప్రేమలేఖ రాసి, ఒకడుగు ముందుకేశాడు. తన అభ్యర్థన సుజాత తప్పక మన్నిస్తుందన్న విశ్వాసం శంకరాని కుంది.

ఒకవేళ కర్మం చాలక సుజాత ఆగ్రహిస్తేనో?

ఆగ్రహించడానికి తనేం తప్పు చేశాడు? అల్లరి చెయ్యలేదు. బలవంత పెట్ట లేదు. ఆమె మీద మనసుం దన్నాడు. ఆమె అంటే ఎంతో ఇష్టం అన్నాడు. ఆమె లేందే బ్రతకలేనన్నాడు. కరుణించ మన్నాడు. కటాక్షించమన్నాడు. మనసులో ఇంత చోటివ్వమన్నాడు. ప్రేమ భిక్ష పెట్టమన్నాడు. అనే విషయాన్ని ఉత్తరంలో రాశాడు. అసభ్యకర మైన పదాలు ఎక్కడా దొర్లనివ్వలేదు. కష్టపడి మంచి మంచి మాటలు ఏరి, కళాఖండంలాంటి ప్రేమ లేఖ తయారు చేశాడు. ఇష్టముంటే అంగీక రిస్తుంది. లేకుంటే మానుకుంటుంది. అంతే. అంతకన్నా మరేం చేస్తుంది? ఒకవేళ ఏదన్నా చేస్తుందనుకుంటే— అంతవరకు వస్తే— ఆ ఉత్తరం తను రాయలేదంటాడు. అవును మరి. ఆ ఉత్తరం తను రాసిందే అనడానికి ఆధారా లేమున్నాయ్? తను సంతకం చెయ్యలేదు. పూర్తి పేరు రాయలేదు. పొడిగా 'శంకర్' అన్నాడు. తన పూర్తిపేరు శివశంకరరావు. శంకర్ అంటే తనే ఎందుకవుతాడు? ఈ ఊళ్ళో ఆ పేరుగలవాళ్ళు లక్షా తొంభై మం దుంటారు! అంతకీ ఒప్పుకోక నువ్వే రాశావని అంటే, అంత తెలివి తక్కువగా నా పేరు నేనే ఎందుకు బైట పెట్టుకుంటానయ్యా, బాబూ! ఎవడో పోకిరీ వెధవ నన్ను అల్లరి పెట్టటానికి పాడుపని చేసుంటాడు—అని దబా యించవచ్చు. ఆలోచన ఉండాలే గాని, తప్పించుకోవ డానికి మార్గాలు అనేకం.

పరిణామాన్ని ఇదమిత్థంగా వూహించ లేని శంకరం పరిపరి విధాల ఆలోచించాడు. కీడెంచి మేలెంచటం మంచిదని, ముందు కీడే శంకించాడు. తరవాతే మేలు తలపోశాడు. ఒకవేళ కీడే తటస్థిస్తే తప్పించుకోవటానికి అనువైన పథకం తయారు చేసి సిద్ధంగా ఉంచుకున్నాడు.

ఆ రోజు గడిచి పోయింది. మరుసటి రోజు

> **మనలో ప్రేమించే శక్తినిబట్టి మన వ్యక్తిత్వం రూపు దిద్దు కుంటుంది.**
>
> —గెధె

మధ్యాహ్నం శంకరం ఆఫీసులో ఉన్న సమయంలో సుజాత ఉత్తరం అందుకుంది. పోస్టుమన్ ఇంటి వద్ద ఉత్తరా లిచ్చే సమయం శంకరానికి తెలుసు. అందుకనే 'ఈ పాటికి అందే ఉంటుంది ఉత్తరం' అనుకున్నాడు ఆ సమయంలో. ఈపాటికి కవరు చించుతుంది. ఈ పాటికి ఉత్తరం చదవటం ముగిస్తుంది అనికూడా ఆయా సమయాలు అంచనా వేసుకున్నాడు. కొద్ది క్షణాలు కళ్ళు మూసుకుని, సుజాత కవరు చించే విధానం, ఉత్తరం చదివే భంగిమ వూహల్లో చిత్రించి చూసుకున్నాడు.

అంతా సవ్యంగా జరిగితే తన రొట్టె విరిగి నేతిలో పడినట్టే. సుజాత వంటి అందమైన అమ్మాయిని ఎవ్వరైనా ప్రేమించ గలరు. అందులో విశేషం లేదు. ఆమె చేత ప్రేమించబడటంలోనే ఘనత ఉంది; తృప్తి ఉంది; మజా ఉంది. సుజాతతో ప్రేమ కలాపాలు సాగించటంలో ఉన్న తృప్తి, ఆనందం బహుశా స్వర్గంలోకూడా లభించ వేమో. అయితే అంత అదృష్టం తనకుందా? ఏమో! నమ్మకం కుదరలేదు శంకరానికి.

ఇంతకు ముందు ప్రేమించటం, ప్రేమించ బడటం, ప్రేమ లేఖలు వ్రాయటం లాంటి ప్రేమ సంబంధమైన వ్యవహారాలు అనుభవం లోకి రాలేదు శంకరానికి. విద్యార్థిగా ఉన్నప్పుడు చదువు తప్ప మరో ధ్యాసే ఉండేది కాదు. కాలేజీ జీవితంలో కూడా అమ్మాయిల వెంట పడటం, ఏడిపించటం లాంటి అల్లరి వేషాలు వెయ్యలేదు. బుద్ధిగా చదువుకుని, అందరి చేతా బుద్ధిమంతు డనిపించుకున్నాడు. ఈ రకమైన అనుభవం ఇదే తొలిం ప్రథమం. అందుకనే మరీ వ్యాకులపాటుకు గురి కాసాగాడు.

ఆ సాయంత్రం పెందలకడనే గదికి రావటానికి ధైర్యం చాల్లేదు శంకరానికి. లైబ్రరీలో కాస్సేపు, పార్కులో కాస్సేపు కాలక్షేపం చేసి, ఎనిమిది దాటిన తరవాత హోటల్లో భోజనం ముగించుకుని, నెమ్మదిగా వచ్చాడు.

కలలు, కలవరింతలతో ఆ రాత్రి తెల్లవారి పోయింది. లేచిన తరవాత కిటికీ తెరిచి ఎదురింటి వేపు చూడలేక పోయాడు శంకరం. కాలకృత్యాలు త్వరత్వరగా ముగించుకుని, ఒక గంట ముందే బయటికి వెళ్ళిపోయాడు.

శంకరం అంతగా భయపడి తప్పుకు పారిపోవ టానికి కారణం—తను చేసింది తప్పు అని అతని అంతరాత్మ ఘోషిస్తూంది. అనవసరంగా తొందర పడిపోయాడు. మరికొంత కాలం గడవనిచ్చి, సుజాత నుంచి ప్రత్యక్ష ప్రోత్సాహం లభించిన తరవాతే ఉత్తరం రాయవలసింది. రాయటం, పోస్టు చెయ్యటం, ఆమె అందుకోవటం అన్నీ జరిగిపోయిన తరవాత ఇప్పుడు బాధ పడి మాత్రం ప్రయోజన మేముంది?

ఆ రోజంతా ఆఫీసు పనిలో మనస్సు లగ్నం చెయ్యలేక పోయాడు శంకరం. సాయంత్రం ఆఫీసు నుంచి తిన్నగా గదికి వెళ్ళలేదు. ముందు రోజు లాగానే అక్కడా, అక్కడా తిరిగి, ఎనిమిదిన్నరకి చేరుకున్నాడు.

తలుపు తెరిచి లైటు వేసిన శంకరం, కిటికీ వారగా గదిలో పడి ఉన్న ఒక కవరు చూసి గతుక్కు మన్నాడు. సంభ్రమాశ్చర్యాలతో ఆ కవ రందుకొని అటూ ఇటూ తిప్పి చూశాడు. స్టాంపు లేదు. ముద్ర లేదు. అడ్రసు లేదు. అదొక ఫ్యాన్సీ కవరు. నీట్‌గా అంటించి ఉంది. గబగబా చించి లోపల మడిచి ఉన్న కాగితాన్ని ఆత్రంగా తీసి చూశాడు. ముత్యాల కోవ లాంటి అక్షరాల వరుసలు. సుజాత రాసిన ఉత్తరం అది.

"శంకర్ గారికి,

మీ ఉత్తరం ఆనంద సాగరంలో వోలలాడించింది నన్ను. నన్ను గురించి మీరు రాసిన వన్నీ అతిశ యోక్తులే. అయినా, నా పట్ల మీరు చూపించిన గౌరవానికి కృతజ్ఞతలు.

మీ హృదయంలో నాకు అత్యున్నత స్థానం కల్పించా మన్నారు. నా గుండెలో మీ కింత చోటివ్వ మని అభ్యర్థించారు. అందుకు నా కలాంటి అభ్యం తరం లేదు గాని, మీరు అవివాహితులు. నేనూ అవివాహితనే. ఇద్దరు అవివాహితులైన యువతీ యువకులు కలిసి స్వేచ్ఛగా ప్రణయ కలాపాలు సాగించటం మన సమాజం అంగీకరించదు. ముందు పెళ్ళి, తర్వాత ప్రేమ. ఇదీ ఈ నాటి మన సాంఘిక న్యాయం.

మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటానికి, ప్రేమించు డానికి, జీవిత సహచరిణి కావడానికి నా వరకు ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే, నేను తల్లి తండ్రుల చాటు పిల్లని. వాళ్ళని కాదని ఏ పనీ చెయ్య లేను. అందుకనే, మీ ఉత్తరం వాళ్ళకి చూపించి, నా మనస్సు విప్పి చెప్పి, వాళ్ళచేత గూడా ఒప్పుకొని పించాను.

ఈ ఉత్తరం నా అంగీకారాన్ని తెలియజేస్తుంది. రేపు ఉదయం ఎనిమిది గంటలకి మా నాన్నగారు స్వయంగా వచ్చి తమ అంగీకారాన్ని తెలియపరుస్తారు.

ముందు పెళ్ళి, తర్వాత ప్రేమ. ఎంత త్వరగా పెళ్ళి జరిగితే అంత త్వరగా ప్రేమ మొదలవుతుంది!

మర్చిపోకండేం— రేపు ఖచ్చితంగా ఎనిమిది గంట లకు మా నాన్న గార్ని పంపిస్తాను.

ఇట్లు,
—సుజాత.'

* * *

అన్న ప్రకారం ఉదయం ఎనిమిది గంటలకి సుజాత తండ్రి వచ్చాడు — ఒక పిల్లకైనా కట్నం లేకుండా, ఉద్యోగస్థుడైన అల్లుణ్ణి సంపాదించి పెళ్ళిచెయ్య గలుగుతున్నా నన్న సంతోషంతో.

కాని, శంకరం లేడు.

గది ఖాళీ!

రాత్రే ఖాళీ చేసి వెళ్ళిపోయాడని ఇంటి వాళ్ళు చెప్పారు. *